ప్రజాశక్తి
శనివారం 11 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



గిరిజన గ్రామాల్లో భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను షెడ్యూల్ తెగల ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 15 నుంచి విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో ఈనెల 15 నుండి 30 వరకు, కురుపాం మండలంలోని 23 పంచాయతీల్లో డిశంబరు 1 నుండి 15వరకు, సీతంపేట మండలంలోని 53 పంచాయతీల్లో ఈనెల 15నుంచి డిశంబరు 16వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ యాత్రలో డిపిఒ జిల్లా నోడల్ అధికారిగా, డిఎంహెచ్ఒ, డిఎస్ఒ, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు, జిల్లా వ్యవసాయఅధికారి, జిల్లా ఉద్యానఅధికారి, జిల్లా మత్స్యఅధికారి, ఐసిడిఎస్ పిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ పాల్గొని వారి శాఖల పరిధిలో జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఇజ్రాయిల్ దాడులను ఖండించండి

వామపక్షాల ఆధ్వర్యాన నిరసన ర్యాలీ




పార్వతీపురం ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఇజ్రాయిల్‌కు మోడీ మద్దతు ఇవ్వడం దారుణమని, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను యావత్ భారతదేశం ఖండించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాలస్తీనాకు మద్దతుగా పార్వతీపురం పట్టణంలో శుక్రవారం సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ లిబరేషన్, గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని తెలిపారు. పాలస్తీనా భూభాగం పాలస్తీనా వారిదేనని గతంలో మహాత్మా గాంధీ కూడా చెప్పారని, ఇప్పుడు అమెరికా మద్దతు పలకడంతో ఇజ్రాయిల్ రెచ్చిపోతుందని అన్నారు. ఇప్పటికే పదివేల మందిని పాలస్తీనియన్లను చంపారని, వారిలో మహిళలు, పిల్లలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాలస్తీనాకు మోడీ ప్రభుత్వం దేశ ప్రజల తరపున సంఘీభావం తెలపాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ నాయకులు పి.శ్రీనునాయుడు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు ప్రకారం పాలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయిల్ పూర్తిగా వైదొలగాలని కోరారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పి.రమణి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తటస్థ వైఖరి విడనాడి పాలస్తీనా ప్రజల కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. లిబరేషన్ పార్టీ నాయకులు పి.భాస్కరరావు మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్యవాద వైఖరిని విడనాడి ఇజ్రాయిల్‌కు మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు. సిపిఐ జిల్లా నాయకులు టి.జీవ మాట్లాడుతూ ఆయిల్ గనుల కోసం ఇజ్రాయిల్‌ను అమెరికా, బ్రిటన్ పావుగా ఉపయోగించుకొని యుద్ధాన్ని సృష్టిస్తున్నాయని తెలిపారు. అఖిలభారత లిబరేషన్ పార్టీ గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంఘం మాట్లాడుతూ గాజాపై దాడులు అత్యంత హేయమైందన్నారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి రంజిత్ కుమార్ మాట్లాడారు. సంఘం భావం ర్యాలీ, సభలో సిపిఐ ఎంఎల్ నాయకులు భాస్కరరావు (భాష), సర్వేశ్వరరావు, న్యూ డెమోక్రసీ నాయకులు బొత్స నర్సింగరావు, అఖిల భారత మహిళా సంఘం నాయకులు దుర్గా చంద్ర చూడామణి, సిపిఎం జిల్లా నాయకులు జి.వెంకటరమణ, కె.సాంబమూర్తి, పట్టణ నాయకులు సంచాన ఉమా, బంకురు సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, వి.ఇందిర, తులసి, జి.వెంకటరమణ, విద్యార్థి నాయకులు పండు, రాజు, కళాశీలు, కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సామాజిక సాధికార యాత్రలో మంత్రులు ధర్మాన, బూడి, రాజన్నదొర



సభలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు, పంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలునాయుడు, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర శుక్రవారం పార్వతీపురంలో జరిగింది. తొలుత సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట నుంచి ప్రారంభమైన బస్సుయాత్రకు వైసిపి కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీతో పార్వతీపురం చేరుకున్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఎవరి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకూ, మెరుగుదలకూ ఉద్దేశించి చేస్తున్న పథకాల నిర్వహణను అర్థం చేసుకుని, వాటితో ముడిపడి ఉన్న ఆర్థిక ప్రయోజనాలు కన్నా సామాజిక ప్రయోజనాలను గుర్తించాలన్నారు. ఇదీ టిడిపికి, వైసిపి ప్రభుత్వానికీ ఉన్న తేడా అని అన్నారు. ఊరూరా తిరిగి ప్రజల కష్ట నష్టాలు గుర్తించి పాదయాత్రలో చెప్పినవన్నీ చేసిన ఏకైక నాయకులు వైఎస్ జగన్ అని చెప్పారు. విద్యాభివృద్ధి కోసమే నాడు-నేడు పథకాన్ని జగన్ తీసుకొచ్చారని తెలిపారు. ఏ కారణంతోనూ పేదల చదువు అర్థాంతరంగా ఆగిపోకూడదని భావించి, రకరకాలుగా వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని వివరించారు.

అట్టడుగువర్గాలకు అండగా : రాజన్న దొర

విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక చర్యలు చేపట్టిన ఘనత సిఎం జగన్‌దని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు. గతంలో లంచం లేనిదే పని జరిగేది కాదని, కానీ నేడు ప్రతిదీ ఇంటికే వస్తుందని, కాబట్టి ప్రజలు ఈ రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. పేద వర్గాలంటే అట్టడుగునే ఉండాలనే స్థితిని మార్చారని తెలిపారు. అంబేద్కర్, పూలే, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కల అయిన పార్వతీపురం మన్యం జిల్లాను వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.

మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు, మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పి టిడిపి నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తారని, వారి మాటలు నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొట్టేటి మాధవి, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, విశ్వసరాయి కళావతి, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎస్‌సి కమిషన్ సభ్యురాలు సవరపు జయమణి, ఎమ్మెల్సీ పాలవలస శ్రీకాంత్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వాతి రాణీ, దాసరి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ రమాదేవి, నియోజక వర్గం పరిశీలకులు శోభాహైమావతి, జెడ్‌పి మాజీ చైర్మన్ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, నియోజక వర్గ నాయకులు బోను గౌరీశ్వరి, ఇందుపూరు గున్నేష్, కొండపల్లి రుక్మిణీ, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సీతానగరంలో సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేటలో శుక్రవారం సామాజిక సాధికార బస్సుయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా మన్యం జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజ్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా అభివృద్ధి అయిందన్నారు. గిరిజన యూనివర్సిటీ, ఆసుపత్రులు వంటివి అభివృద్ధి అయ్యామన్నారు. అంతేకాక అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని గడిచిన నాలుగున్నర ఏళ్ల ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. ఈ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజలకు వివరించేందుకు ఈ బస్సు యాత్ర జరుగుతుందని, అలాగే ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంలో సిఎం ముందున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ రెండోసారి ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

తప్పుల్లేని ఓటరు జాబితే లక్ష్యం : పిఒ

ప్రజాశక్తి - మక్కువ

తప్పుల్లేని ఓటరు జాబితే లక్ష్యం కావాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ప్రాజెక్టు అధికారి ఓటరు నమోదు అధికారులు, బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తామని, ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తున్నామన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాలు వద్ద బూత్ స్థాయి అధికారులు ఉండాలన్నారు. డిసెంబరు 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో మంజూరైన ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పిఒ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, పేదలు అందరికీ ఇళ్లు సమకూర్చ వలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం జాప్యం జరగరాదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గహ నిర్మాణ సంస్థ డిఇ సోమేశ్వర రావు, తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో వర్షాలు లేకపోవడం, కాలువల ద్వారా సక్రమంగా నీరందకపోవడం వల్ల జిల్లాలో ఇప్పటికే చాలా వరకు పంటలు దెబ్బతిన్నందున ప్రభుత్వం వెంటనే కరువు ప్రకటించాలని, అలాగే ఎకరాకు రూ.25వేలు కరువు నష్టపరిహారం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులంతా కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు తక్కువగా కురవడం, జిల్లాలోని కాలువల ఆధారం లేని భూములు, అలాగే కాలువ చివర్లో ఉన్న భూమిలో వరి పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ఇప్పటికే రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారని, సమయం దాటిపోయినా పంట నష్టపరిహారం గుర్తించి ప్రభుత్వం పట్టించుకోగా ఏవేవో తప్పుడు లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం కరువు ప్రకటించకపోతే రైతుకు రావాల్సిన నష్టపరిహారం రాకపోగా, బీమా కూడా రాదని అన్నారు. కావున ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించి యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం అంచనా వేసి మండలాలు, గ్రామాల వారీగా కరువు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మి నాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 15 నుంచి ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను డిసెంబరు 15 నుండి వచ్చే జనవరి 26 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను బాడ్మింటన్, క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో 15 ఏళ్లు పైబడిన మహిళా, పురుషుల విభాగాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామ/వార్డ్ సచివాలయం స్థాయిలో డిసెంబరు 15 నుండి 20వ తేది వరకు, మండల స్థాయిలో డిసెంబరు 21 నుండి వచ్చే జనవరి 4వ తేదీ వరకు, అసెంబ్లీ స్థాయిలో జనవరి 5 నుండి 10వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుండి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు జనవరి 22 నుండి 26 వరకు విశాఖపట్నంలో జరుగుతాయని ఆయన వివరించారు. ఈ క్రీడా పోటీల్లో గ్రామ, వార్డ్ సచివాలయం స్థాయిలలో పంచాయతి, వార్డ్ కార్యదర్శులు, వాలంటీర్లు, మండల స్థాయిలో ఎంపిడిఒలు కీలక భాద్యత నిర్వహించాలని ఆయన చెప్పారు. ఈ పోటీలకు జాయింట్ కలెక్టర్ జిల్లాలో నోడల్ అధికారిగా ఉంటారని చెప్పారు. అనంతరం జెసి ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు జిల్లాలో 312 గ్రామ, 38 వార్డు సచివాలయాలు, 15 మండల కేంద్రాలు, 4 శాసన సభ నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. కార్యనిర్వాహక, సాంకేతిక కమిటీలను నియమించామని, నిర్వహణ విధులు, బాధ్యతలను ఆయా కమిటీలకు వివరించామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా క్రీడా అధికారి యస్.వెంకటేశ్వర రావు, డ్వామా పీడీ కె. రామ చంద్ర రావు, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రమా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

బకాయి వేతనాలు చెల్లించాలి

జెసికి అంగన్వాడీ యూనియన్ వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో రెండు నెలలుగా అంగన్వాడీలకు వేతనాలు లేక చాలా ఇబ్బందులుపడుతున్న పరిస్థితి తెలియజేస్తూ అంగన్వాడీ యూనియన్ తరపున శుక్రవారం జెసి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ వర్కర్లకు వచ్చే వేతనాలు తక్కువగా ఉన్నాయని, దీనికి తోడు పండగ పూట కూడా వేతనాలు లేకుండా దసరా, దీపావళి పండగలు చేసుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. అలాగే దీపావళి పండగ పూట కూడా పిల్లతో సహా అంగన్వాడీ వర్కర్లు పస్తులు ఉంచుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ వర్కర్లంతా జీతాలు బిల్లులు సమయానికి రాక సెంటర్ నిర్వహించుకోవడం కష్టంగా ఉందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిరా మాట్లాడుతూ అందరికీ జీతాలు చెల్లించి వర్కర్ల కళ్లల్లో వెలుగును నింపాలని కోరారు. సమస్యలను విన్న జాయింట్ కలెక్టర్ వెంటనే ఐసిడిఎస్ పిడికి ఫోన్లో సంప్రదించి జీతాలు ఇవ్వకపోవడానికి కారణం తెలుసుకొని వెంటనే జీతాలయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు 8 వేల మంది విద్యార్థులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సైన్స్ దినోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపల్లి గౌరు నాయుడు, సార్తి మహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోనే 122 పాఠశాలలో 8వేల మంది విద్యార్థిని విద్యార్థులు చెకుముకి సంబరాల ప్రతిభ పరీక్షలు రాస్తున్నట్లు వారు తెలిపారు. ఇందులో విజేతలైన విద్యార్థులు మండల స్థాయిలో ఈనెల 30న జరగబోయే చెకుముకి పరీక్షకు అర్హులవుతారని వారన్నారు. డిసెంబరు 17న జిల్లాస్థాయి, 2024 జనవరి 27,28 తేదీల్లో రాష్ట్ర స్థాయి పరీక్షలు జరగనున్నట్లు వారు తెలిపారు. ప్రతి విద్యార్థి ఇందులో పాల్గొని తమ ప్రతిభను కనబర్చుకోవాలని కోరారు.

నేడు అబుల్ కలాం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జనాబ్ మౌలానా అబుల్ కలాం అజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 11న స్థానిక కలెక్టరేట్ మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ ఎడ్యుకేషన్ డే నిర్వహించనున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి, టి.చంద్రశేఖర రావు తెలిపారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ముత్యాలునాయుడు

కాశీపేటలో గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేటలో కొత్తగా నిర్మించిన సచివాలయాన్ని రాష్ట్రపంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలునాయుడు శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు సొంత భవనాలు ఉండడం ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, ఎంపిపిలు గొట్టేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, వైసిపి ఉత్తరాంధ్రా కన్వీనర్ వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు ఎ.జోగారావు, శంబంగి వెంకటచినప్పలనాయుడు, పాముల శ్రీపుష్పవాణి, ఎంపిడిఒ వి.కృష్ణమహేష్‌రెడ్డి, పలువురు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు

దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా పేల్చడంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా పేల్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వదులుగా వుండే, కాటన్ దుస్తులు ధరించి బాణసంచా కాల్చాలని కోరారు. దీపావళి పండుగ ఆనంద వెలుగులు నింపాలని, విషాద చీకటికి నిలయం కాకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, యామిని పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలని, ఒక సారి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలిపిన సమస్యలను గుర్తించి మళ్లీ రాకుండా పరిష్కారం చూపాలని జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే జగన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారం గూర్చి సంబంధిత అధికారులతో నేరుగా చర్చించి, సూచనలు చేశారు. మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 32 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు, తహసీల్దారు ఎన్. శివన్నారాయణ, ఎంపిడిఒ షేక్ అకీబ్ సాహెబ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని పట్టణంలోని 18వ వార్డు మహిళలు శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యాలయంలో ఆర్‌డిఒ కె.హేమలతకు వినతిని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి పట్టణంలోని 18వ వార్డులో తామంతా నివాసముంటున్నామని, గత సంవత్సరం ప్రభుత్వం పట్టాలిచ్చి పక్కా ఇళ్లు నిర్మాణం చేసుకోమని అనుమతులు ఇవ్వగా తాము నివాసం ఉన్న పాకలను తీసేసి ఇళ్ల నిర్మాణం చేసుకుంటుండగా ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకుంటున్నదని అన్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన స్థలంలోనే ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నామని, ప్రభుత్వం తమకిచ్చిన పట్టాలు తమ దగ్గరే ఉన్నాయని, అయినా ఇవేమీ పట్టించుకోకుండానే ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమ వద్దనున్న ఇళ్ల పట్టాలను పరిశీలించి తమ ఇళ్ల స్థలాల్లో నిర్మించుకునేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, నాయకులు కృష్ణమూర్తి, 18వ వార్డులో గల మహిళలు పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎంకు స్పందన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరెడ్డి శుక్రవారం సాయంత్రం 4నుంచి 5వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 12ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పారు. వీటిలో ఎనిమిది మంది దుగ్గేరు-సాలూరు-రావులపాలెం ఎక్స్ ప్రెస్ సర్వీస్ నడపాలని కోరినట్లు తెలిపారు. దుగ్గేరు నుంచి రోజూ ముగ్గురు ప్రయాణికులు కూడా ఉండనందున దుగ్గేరు నుంచి సాలూరు వరకు లింక్ సర్వీస్‌గా నడుపుతున్నామని, సాలూరు నుంచి యధావిధిగా రావులపాలెంకు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నడుపుతున్నామని చెప్పారు. సాలూరు నుంచి దేవుబుచ్చింపేట, చిన బోరబంద, పెద బోరబంద మీదుగా బొబ్బిలికి బస్సు నడపాలని కోరారని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బొబ్బిలి బస్సు నడపడానికి కృషి చేస్తామని చెప్పారు. సాయంత్రం వేళ శంబర ట్రిప్ నడపాలని కోరారని, దీన్ని పరిశీలిస్తామని డిఎం భాస్కర్ రెడ్డి చెప్పారు.




సదస్సులో మాట్లాడుతున్న లీడ్ ఫైనాన్స్ ప్రతినిధి అవినాష్

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతు ఉత్పత్తిదారుల సంఘాల మరింత బలోపేతం చేయాలని డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ లీడ్ ఫైన్సా ప్రతినిధి అవినాష్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు నూతన కార్యాలయ భవనంలో శుక్రవారం డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ వారి రూ.20 లక్షల ఆర్థిక సహకారం, ఎఫ్‌పిఒ రూ.3 లక్షలు విరాళంతో నిర్మించిన సరుకుల నిల్వ గోడౌన్‌ను, ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. దీన్ని అన్నపూర్ణేశ్వరి గిరిశక్తి ఎఫ్‌పిఒకు అందజేశారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ జట్టు సంస్థ పరిధిలో 3 ఎఫ్‌పిఒలకు చెందిన రైతుల సరుకులను నిల్వ చేసుకోవడానికి, వ్యాపారంలో ఆర్థిక అభివృద్ధిని పెంచుకోవడానికి ఈ గోడౌన్‌ను ఉచితంగా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చడానికి, ఉత్పత్తి చేసిన పంటలు, పదార్థాలు వినియోగదారులకు నేరుగా చేరువయ్యేలా దళారీ బెడద లేకుండా ఫలితాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నేరుగా అందుకునేందుకుగాను ఇది మంచి అవకాశమని తెలిపారు. ప్రతి సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు మార్కెట్ చేయాలని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార కార్యక్రమాలు నిర్వహించాలని, వచ్చిన లాభాల్లో వాటాదారులకు పంచాలని, వాటాదారులను ఎక్కువ సంఖ్యలో చేర్పించాలని మహిళలను ఎక్కువగా చేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి. పారినాయుడు, డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ ఫైనాన్స్ మేనేజర్ శశిబాల, డిజిఎఫ్ స్టేట్ కోఆర్డినేటర్ సురేంద్ర, ప్రకతి వ్యవసాయ జిల్లా పి.షణ్ముఖ రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. ప్రహరాజ్, ఎఫ్‌పిఒ ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ టి. శివాజీ, ఎఫ్‌పిఒ అధ్యక్షులు వెంకట నాయుడు, మన్మధరావు, జమ్మయ్య, రైతులు షేర్ హోల్డర్లు పాల్గొన్నారు.


విద్యార్థితో పాఠాలు చదివిస్తున్న జెసి గోవిందరావు

నూరుశాతం ఫలితాలు సాధించాలి : జెసి

ప్రజాశక్తి - పాచిపెంట

రానున్న పదో తరగతి పరీక్షల్లో అందరూ కష్టపడి శత శాతం ఫలితాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ గోవిందరావు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ముఖ్యంగా మోడల్ పేపర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొంతమంది విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఇష్టపడి చదివితే ఏదీ కష్టం కాదని హితవు పలికారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకత తర్ఫీదు ఇవ్వాలని బాధించకుండా బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్ ఎంపిడిఒ లక్ష్మీకాంత్, ఎంఇఒ పి.జోగారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ తప్పనిసరిగా ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వర ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎంవి రమణ సమక్షంలో ఎఒ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జిపిఎస్ ఉంటేనే వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయడమవుతుందన్నారు. ఈ పరికరం ఏర్పాటుకు రూ.2600 ఖర్చవుతుందన్నారు. దీన్ని ఏర్పాటు చేసేందుకు టెక్నీషియన్ సంగీత్ కుమార్ 7981454324 అందుబాటులో ఉంటారన్నారు. కావున ఈ జీపిఎస్ పరికరాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎఒ రబీ విత్తనాలు కావాల్సిన రైతులు వెంటనే విఎఎలను సంప్రదించాలని తెలిపారు. మినిములు 4కేజీ రూ.300, పెసలు 4కేజీ రూ.330, కట్టెలు 10కేజీ రూ.420 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కె.వెంకటాపురం సర్పంచ్, రైతులు పాల్గొన్నారు

మామిడిపల్లి విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పార్వతీపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పార్వతీపురంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్‌లో మామిడిపల్లి విద్యార్థులు సమాజంలో మూఢనమ్మకాలపై నాటిక ప్రదర్శించారు. 8వ తరగతి విద్యార్థిని జి.చరిస్మా మానవ మనుగడకు పర్యావరణ ఆవశ్యకతపై ప్రాజెక్టు ప్రదర్శించినందుకు ప్రశంసాపత్రం అందజేశారు. డిఇఒ ప్రేమ్ కుమార్ విద్యార్థులను అభినందించారు. పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కోట అయ్యప్ప విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి సైన్స్ కాంగ్రెస్‌కు తీసుకెళ్లారు.

రచ్చబండను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొత్తగూడలో సుమారు రూ.3 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రచ్చబండను పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ రచ్చబండ వద్ద గిరిజనులు తమ సమస్యలను పెద్దలకు చెప్పుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ధ్రువపత్రాల కేసుల విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

బోగస్ ధ్రువపత్రాలకు సంబంధించిన కేసులను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం విచారించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు, కేసులను ఎదుర్కొంటున్న వారిని విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అలాగే కేసులకు సంబంధించిన వారి కులానికి, చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలను సంబంధిత తహశీల్దార్, పాఠశాల హెచ్ఎంల ద్వారా తెప్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.రోసిరెడ్డి, డిడి జి.మంగవేణి, గిరిజన జెసిపి సెక్షన్ వాబయిగా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారి బాగు చేయండి మహాప్రభో

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్ర - ఒడిశా అంతర్ రాష్ట్ర రహదారిపై గోతులు మరమ్మతులు చేసి రోడ్డు బాగు చేయండి మహాప్రభు అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గుమడ వద్ద గల అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడేళ్ల మూడు రాష్ట్రాలకు వెళ్లే కూనేరు అంతర్రాష్ట్ర రహదారి మార్గంలో కొమరాడ గ్రామ సమీపంలో ఈశ్వరుని ఆలయం వద్ద, గుమడ, కోటిపాం, బంగారంపేట, ఇందిరానగరం, కూనేరు గ్రామాల వద్ద రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున రాస్తారోకో చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆటో డ్రైవర్లు ప్రయాణికులు పాల్గొన్నారు.

ఎవరి అనుమతితో చెట్లు తొలగించారు?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎవరి అనుమతితో ప్రధాన రహదారిపై డివైడర్‌పై ఉన్న చెట్లను, మొక్కలను తొలగించారని జనసేన రాష్ట్ర నాయకులు పాలూరి బాబు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన నాయకులతో కలిసి చెట్లు తొలగింపుపై నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని రెవెన్యూ అధికారి రూబెన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోకుండా డివైడర్‌పై ఉన్న చెట్లను ఎలా తొలగించారని, వైఎస్ఆర్ సాధికార బస్సు యాత్ర కోసం చెట్లను తొలగించి పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని మున్సిపల్ అధికారులు తుంగలో తొక్కారని విమర్శించారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో అనధికార కట్టడాలపై చర్యల్లేవని, పట్టణ ప్రజలకు నాలుగు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారని, కానీ పచ్చగా ఉన్న మొక్కలను తొలగించారని, మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సరోజినీ మరణం తీరనిలోటు

ప్రజాశక్తి - సీతంపేట

ఆశా వర్కర్ నిమ్మక సరోజిని మరణం తీరని లోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు శుక్రవారం ఆశా వర్కర్ సరోజిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు, ఆశా వర్కర్ల ప్రతినిధులు సరోజిని సేవలను కొనియాడారు. చనిపోయిన ఆశా వర్కర్ కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కారానికి సరోజిని స్ఫూర్తితో ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు, సరోజనమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెముడులో భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు పంచాయతీలో టిడిపి ఆధ్వర్యాన శుక్రవారం బాబుతో ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జి.వేణుగోపాల్ రావు, సీనియర్ నాయకులు ప్రసాదరావు నాయుడు, పలువురు టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కడగండి పంచాయతీ పరిధిలో గల కడగండి, పెదవంగర, పెదవంగరగూడ, ఒండ్రుజోల, భూచంద్రి, సంతవలసలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, తెలుగు యువత మండల అధ్యక్షులు సవర సంతోష్, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరిక పవన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో లోపాలు సరిచేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇటీవల కాలంలో సమగ్ర భూ రీసర్వేలో అనేక లోపాలున్నాయని, అందుకు ప్రధాన కారణం ప్రభుత్వ యంత్రాంగం సరైన పద్ధతిని పాటించకపోవడమేనని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ భూ రీసర్వే సరైన పద్ధతిలో జరగకపోవడం వల్లనే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. భూ రీసర్వే నిర్వహిస్తున్న గ్రామంలో మొదటిగా గ్రామసభ నిర్వహించి, భూ యజమానికి నోటీసులిచ్చి భూ రీసర్వే చేయాలన్నారు. కానీ నేటి వరకు భూ రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో గ్రామసభ నిర్వహించకుండానే రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే భూ రీసర్వే చేయడం, అబ్జెక్షన్ ఫారం ఇవ్వకుండానే సర్వే ప్రక్రియ పూర్తి చేయడం వలన అనేక లోపాలు చోటు చేసుకున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పద్ధతి ప్రకారం భూ రీసర్వే చేపట్టాలని కోరారు. సర్వేలో పద్ధతి పాటించకపోవడం వల్ల ఇప్పటికే మండలంలో ములగ రెవెన్యూలో లచ్చన్నదొరవలసలో సర్వేనెంబర్ 26, 27 గిరిజనులకు 1991లో పట్టాలు ఇచ్చినప్పటికీ, ఇటీవల కాలంలో చేపట్టిన రీసర్వేలో ఆ భూములకు రిజర్వే చేయలేదని అన్నారు. గరుగుబిల్లి మండలంలోని శివ్వాం రెవెన్యూలో సర్వేనెంబర్ 20 నుండి 30 వరకు గల భూములు దళితులకు 1970లో పట్టాలిచ్చినా ఆ భూమిని కూడా సర్వే చేయలేదని తెలిపారు. ఇదే మండలంలోని పోలినాయుడువలస రెవెన్యూలో ఇనాం భూములు సర్వే చేయలేదని తక్షణమే ఆయా భూములపై సర్వే చేసి ఆయా రైతులకు దాఖలు పరచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గేదెలు సత్యనారాయణ, బంటు దాసు, శివ్వాం, పోలినాయుడు వలస, లచ్చన్న దొర వలస గ్రామ రైతులు పాల్గొన్నారు.


జెసి వినతిని అందజేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

నాణ్యమైన వైద్యం జెఎఎస్ లక్ష్యం

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని లికుడ్డపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆమేరకు వైద్య సేవలను అందించే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమన్నారు. నియోజవర్గంలోని 102 సచివాలయాలలో ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, జడ్పిటిసి ప్రతినిధి రాము, వైద్యాధికారి రవీంద్ర చాందిని తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మ వలస మండలం చినమేరంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారని, రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను విమర్శించే స్థాయి సంధ్యారాణి కి లేదు : వైసిపి

ప్రజాశక్తి - సాలూరు

అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంను విమర్శించే స్థాయి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణికి లేదని మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ, పిఎసిఎస్ ఛైర్మన్ పెద్దింటి మాధవరావు అన్నారు. శుక్రవారం మామిడిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సాధికారత బస్సు యాత్ర లో బాగంగా నిర్వహించిన సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడితే తప్పేముందని చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు అనేక పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ చంద్రబాబు నాయుడు ఫోటోకు పాలాభిషేకం కూడా చేశారని గుర్తు చేశారు. వైసిపీ ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు జరిగిన సామాజిక న్యాయం గురించి స్పీకర్ మాట్లాడితే టిడిపి నాయకులు ఎందుకు ఉలికి పడుతున్నారని ప్రశ్నించారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా సాలూరు పట్టణం నడిబొడ్డున బోసుబొమ్మ జంక్షన్‌లో జాతీయ రహదారిపై టిడిపి నాయకులు ప్రచార సభ నిర్వహించిన విషయం సంధ్యారాణికి గుర్తు లేదా అని ప్రశ్నించారు. టిడిపి టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్న సంధ్యారాణి అగ్రనేతల మెప్పు కోసం లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నారైని టిడిపి అభ్యర్థిగా రంగంలోకి దించాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారని తెలుస్తోందని, సీటు సాధించుకున్న తర్వాత మాట్లాడాలని వైసిపి నాయకులు ఎద్దేవా చేశారు.

నిర్బంధాలతో ప్రజా వ్యతిరేకతను అడ్డుకోలేరు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రజల వాణిని వినిపించే నాయకులను గృహనిర్బంధాలు విధించినంత మాత్రాన వైసిపి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను ఎవరూ అడ్డుకోలేరని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికారత బస్సు యాత్రను టిడిపి నాయకులు అడ్డుకొని నలుపు రంగు బెలూన్లతో నిరసన తెలియజేస్తారన్న ముందుస్తూ సమాచారంతో రూరల్ పోలీసులు, ప్రధాన పార్టీ నాయకులతో పాటు ఇన్చార్జి విజయచంద్రను, మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులను గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏమాత్రం సామాజిక న్యాయం జరిగిందని ప్రశ్నిస్తామనే భయంతో ప్రతిపక్షాల గొంతును పోలీసుల సహాయంతో అధికారాన్ని అడ్డుపెట్టుకొని నొక్కుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని పచ్చదనంతో సంరక్షిస్తే రాత్రికి రాత్రే చెట్లను నరికించి పట్టణానికి శ్మశాన శోభను తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. అధికారులు ఎవరి సూచనల మేరకు ఈ దుర్వినియోగానికి పాల్పడ్డారు భవిష్యత్తులో సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని, అలాగే రాజకీయ పార్టీల యాత్ర కోసం దగ్గరుండి పట్టణానికి హాని కలిగించేలా స్థానిక ఎమ్మెల్యే చెట్లను తొలగించడాన్ని ప్రోత్సహించడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకున్నంత మాత్రాన ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అడ్డుకోలేరని ఇప్పటికైనా నాయకులు వాస్తవాలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, పోలా సత్యనారాయణ, బోను చంద్రమౌళి, బుడితి శ్రీరామ్ తో, పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.


పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కురుపాం : తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులను పెట్టడం వైసిపి ప్రభుత్వం మానుకోవాలని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కేవలం కక్షపూరితమైన రాజకీయాలు చేసి టిడిపి శ్రేణులకు ఇబ్బందులు గురిచేస్తూ అక్రమ కేసులు బనాయిస్తుందని తప్ప పరిపాలన ఏమీ లేదని ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి చంద్రన్న ప్రభుత్వం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు వి.భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి

ప్రజాశక్తి - వీరఘట్టం

రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమం ఫలాలు గూర్చి ప్రజలకు వివరించాలని, ఎమ్మెల్సీ విప్ పాలవలస విక్రాంత్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఒకటవ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలని అనే కార్యక్రమంలో భాగంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్కారంగా ఉండాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో

ఇంటింటా ప్రచారం

వీరఘట్టంలోని కూరాకుల వీధిలో ఎంపిపి డి.వెంకట రమణ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ కెఎల్ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ బి.లక్ష్మీకాంతం-లక్ష్మీనారాయణ, నల్లబిల్లి విస్సు, పార్టీ సీనియర్ నాయకులు పాలవలస ధవలేశ్వరరావు, మాజీ ఎంపిటిసి బొమ్మలి హేమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక సచివాలయం-1 వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి వైసిపి జెండాను ఎగరవేసి అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ఈ ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ , అదేవిధంగా గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి గల తేడా ఉన్న కరపత్రం ను చూపిస్తూ, సచివాలయ పరిధిలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, జడ్పీ కొ ఆప్షన్ సభ్యులు ప్రతినిధి సవర చంద్రశేఖర్, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, వైస్ ఎంపిపి మూటక విజయలక్ష్మి, పాలకొండ ఎఎంసి ఛైర్మన్ హిమరిక మోహన్‌రావు, సర్పంచ్ కళావతి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీ పురం : ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే గుమ్మలక్ష్మీపురం లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపి నిమ్మకశేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, సర్పంచి బి గౌరీ శంకర్రావు ఉన్నారు.

పాచిపెంట : వైసిపి నాలుగున్నర ఏళ్లలో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందించిన లబ్ధికి సంబంధించి వివరాలను నమోదు చేసిన డిస్ప్లే బోర్డును ఎంపీపీ బి.ప్రమీల, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కొర్రజన్ని సింహాచలం, మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి, సభలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పాచిపెంట వీరంనాయుడు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేవిడ్ మృతి ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



సాలూరు : నివాళ్లు అర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత మన్నం దేవిడ్ మృతి ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి దేవిడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్వతీపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు బంగారు రవి తల్లి మైనమ్మ మృతి చెందడంతో ఆమె భౌతిక దేహానికి పూలమాలవేసి వారి కుటుంబ సభ్యులకు ఓదార్చారు. మైనమ్మ మున్సిపల్ వర్కర్ గా పట్టణ ప్రజలకు మంచి సేవలందించారని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, నాగవంశం శంకరరావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, బంగారి రాజేష్, మంగళగిరి శ్రీను, గంటేడి గంగరాజు, మామిడి మజ్జి, పాపులమ్మ, తదితర మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మన్నం దేవిడ్ సేవలు మరువలేనివని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మన్యం జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు అన్నారు. యూనియన్ నాయకులు టి.శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో దేవిడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే పార్వతీపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.రవి తల్లి మన్నెమ్మ మృతి కి కూడా సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.వెంకట్రావు, పోలరాజు పాల్గొన్నారు.


ఇళ్ల ముందు పూడ్చకుండా విడిచిపెట్టిన గొయ్యిలు

ఎక్కడ గోతులు అక్కడే...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో జల జీవన్ మిషన్ కింద ఇంటింటి కొళాయి ద్వారా నీళ్లు సరఫరా చేసేందుకు మెయిన్ లైన్ పైపులు వేసేందుకు తవ్విన గోతులు పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సీతానగర - అజ్జాడ ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడిచిన 10 రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికీ ఏ ఒక అధికారి పట్టించుకోవడంలేదని, ఈ సమస్యను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించిందని, సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే నాసిరకంగా చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వసతిగృహ (హాస్టల్) విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన రావికోనలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య తనిఖీల రికార్డు పరిశీలించి హీమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన విద్యార్థుల్లో ఏ విధమైన నివారణా చర్యలు చేపడుతున్నారని సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అందజేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.సిమ్మన్నదొర, సిహెచ్ఒ బి.ఊర్మిళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ధాన్యం కొనుగోలు చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఆర్థికంగా నష్టపోయారని, వీటిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీల ప్రసాద్ మాట్లాడుతూ రైతులను దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోలుకు చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి, ఎఒ జె.సౌజన్య, బోర్డు మెంబర్లు ఎస్.సింహాచలం, పి.అప్పారావు, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, విఎఎలు పాల్గొన్నారు.

విద్య, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అటవీ సంరక్షణ చట్టాలు -2023 రద్దు చేయాలని ఆదివాసి విద్యార్థులు సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో గల గిరిజన భవన్‌లో పిడిఎస్ఒ జిల్లా కన్వీనర్ కె.సోమేష్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సుకు ప్రధాన వక్తగా విచ్చేసిన రచయిత, కవి గంటేడ గౌర్నాయుడు మాస్టారు మాట్లాడుతూ ఈరోజు విద్యార్థులకు రాజకీయాలు అవసరం లేదని వాళ్ళు కేవలం చదువుకు పరిమితం అయితే చాలు అనే విధంగా మాట్లాడుతున్నారని రేపు ఈ సమాజాన్ని నడిపించాల్సింది విద్యార్థులేనన్నారు. కావున విద్యార్థులు కచ్చితంగా రాజకీయాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఉపాధి, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని, ఇప్పుడు పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేడు అటవీ సంరక్షణ పేరుతో పర్యావరణానికి నష్టం కలిగించే, గిరిజనులను అడవుల నుంచి గెంటివేసే చట్టాలను చేస్తుందని, దీనివల్ల అమాయకమైన ప్రజలు నిరాశ్రయులవుతున్నారని తెలిపారు. కావున ప్రతి విద్యార్థి ఈ చట్టాల నష్టాన్ని గుర్తించి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు


ప్రజాశక్తి - వీరఘట్టం

కూరగాయలు పంటలు పండించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చునని పాలకొండ వ్యవసాయ శాఖ ఎడి కె.రత్నకుమారి రైతులకు సూచించారు. మండలంలోని విక్రంపురంలో ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎటిఎం మోడల్ బ్లాక్‌గా 20 సెంట్లు భూవిస్తీర్ణంలో 25 రకాల కూరగాయలు, ఆకుకూరలు కలిపి పంటలు సాగు చేస్తే 365 రోజులు కూడా పంట కోయడంతో పాటు రైతుకు అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కూరగాయల పంటలు సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య, ఏపీ సీఎన్ఎఫ్ సభ్యులు మారుతి సింహాచలం, విఎఎలు, రైతులు, పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ

ప్రజావక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి వార్షికోత్సవ తనిఖీని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి శుక్రవారం తనిఖీ చేపట్టారు. విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుంటే ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ తదితరులున్నారు


రోడ్డు పనులు చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి

రోడ్డు పనులు అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల బల్లుకోట గిరిజన గ్రామానికి స్వాతంత్రం వచ్చి ఎన్నో ఏళ్లు గడుస్తున్నా రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి చొరవ తీసుకొని కొత్తగా చేపట్టిన బల్లుకోట శాశ్వత రహదారి నిర్మాణ పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు మాట్లాడుతూ అటవీ శాఖ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు బి.టి రహదారి పనులు తాత్కాలికంగా ఆపివేయాలని, అటవీశాఖ పూర్తి అనుమతి వచ్చిన తర్వాతే కొనసాగించాలని సూచించారని, ఐటిడిఎ నుంచి అనుమతి కోసం దరఖాస్తు పెండింగ్‌లో ఉందని డిఎల్‌సి, అటవీశాఖ అనుమతి తర్వాత బిటి వేయాలని అంతవరకూ పని ఆపివేయాలని అడ్డుకున్నారని అన్నారు. ఇంత శరవేగంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో తమ గ్రామస్తులు ఆనందంలో ఉన్న అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యామని కావున పై అధికారులు స్పందించి తమ గ్రామ రహదారి పరులు జరిగేలా చూడాలని కోరుతున్నామన్నారు.

ఉచితంగా గ్యాస్ పొయ్యిలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ టిడిపి నాయకులు ఎం.ప్రసాద్‌రావు నాయుడు అన్నారు. మండలంలోని చెముడు పంచాయతీలోని లింగడవలస బురదగెడ్డ వలస, పాలికి వలస గ్రామాల గిరిజన మహిళలకు 51గ్యాస్ స్టౌవ్‌లను శుక్రవారం అందజేశారు. మహిళలు ఆరోగ్యం గా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చెముడు గ్రామానికి చెందిన జిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ అసెంబ్లీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల చేత మ్యాక్ అసెంబ్లీ నిర్వహించారు. నిత్యజీవితంలో అసెంబ్లీ నిర్వహణ ఎలా నిర్వహిస్తారో అలాగే విద్యార్థులు అధికార ప్రతిపక్ష పాత్రల పోషించి వాద ప్రతి వాదనలు చేశారు. అసెంబ్లీ స్పీకర్‌గా ఎం.త్రినాధ సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా టి.వినయ్ పోషించగా, మంత్రులుగా పలువురు విద్యార్థులు పాత్ర పోషించారు. ప్రతిపక్ష నేతగా కరణం అనిల్ పాత్ర పోషించారు. అధ్యక్ష, ప్రతిపక్ష నేతలు వాద ప్రతి వాదనలు అద్భుతంగా మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలకు సంబంధించి ముఖ్యమంత్రి పాత్రధారి వినయ్ చక్కగా వ్యక్తపరిచారు. ప్రతిపక్ష సభ్యులు ఖండిస్తూ వారి వాదనలకు ప్రతివాదనలు చేసి సభా కార్యక్రమం అద్యంతం అసెంబ్లీ వాతావరణం కళ్ళు కట్టినట్లు నడిపించారు. ఈ కార్యక్రమం ఆర్ట్స్ అధ్యాపకులు డి లక్ష్మీకుమారి శ్రీవాణి, గణేష్ ఆధ్వర్యంలో మార్గ నిర్దేశంలో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ టి శ్రీవరం పాల్గొన్నారు.